
సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 24 । జనవరి । 2023



డెల్టాలకు 9,250 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 9,250 క్యూసెక్కుల నీరు వదిలారు. తూర్పు 2,750, సెంట్రల్ 1,900, పశ్చిమకు 4,600 క్యూసెక్కులు ఇచ్చారు.



యూడైస్‌తో ఎంతో ప్లస్

పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది.

- వివరాలు 8లో▸

నిత్యాన్నదానానికి విరాళాలు



సఖినేటిపల్లి: లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి భక్తాంజనేయ స్వీట్స్ అధినేత నలాది వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు (తాపేశ్వరం) రూ.50 వేలు, ఎన్‌కేఎస్ఎస్ శ్రీనివాస్, కుటుంబ సభ్యులు (కాకినాడ) రూ.50 వేల చొప్పున సోమవారం విరాళాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

నేడు అజయ్ కల్లాం రాక

వైఎస్సార్ జగనన్న భూ హక్కు – భూ రక్షపై ప్రాంతీయ సమావేశం

సాక్షి, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజయ్ కల్లాం మంగళవారం రాజమహేంద్రవరం రానున్నట్లు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాలకు చెందిన అధికారులతో వైఎస్సార్ జగనన్న భూ హక్కు–భూ రక్ష పథకం అమలుపై రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షిస్తారు. భూ హక్కు – భూ రక్ష పథకం స్టీరింగ్, అమలు కమిటీ చైర్మన్ హోదాలో ఆయన ఈ ప్రాంతీయ సమావేశంలో పాల్గొంటారని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు. అజయ్ కల్లాం పర్యటన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్‌తో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ సోమవారం రాత్రి అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఆర్‌అండ్‌డీ సెల్ ఇన్‌చార్జి డీన్‌గా రమణేశ్వరి



రమణేశ్వరికి ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ ప్రసాదరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి డీన్‌గా ఆచార్య కె.రమణేశ్వరిని నియమిస్తూ ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆమెకు ఉత్తర్వులు అందజేశారు. వర్సిటీ పరిధిలో పరిశోధనలు పెరగాలని ఈ సందర్భంగా ఆయనన్నారు. పరిశోధనలు, ఫెలోషిప్ వంటి అంశాలు ఈ సెల్ పరిధిలోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డీన్‌లు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేషన్‌కు నేడూ అవకాశం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం మంగళవారం కూడా కొనసాగుతుందని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. బయోమెట్రిక్, ఐరిస్, ఫోన్ నంబర్, చిరునామా తదితర నవీకరణకు ఇక్కడ అవకాశం ఉందన్నారు. చిరునామా మార్పునకు తగిన ధ్రువపత్రాల (జిరాక్స్) తీసుకురావాలని సూచించారు.

జిల్లాకు నవ్యశ్రీ పేరు తేవాలి



నవ్యశ్రీని అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికైన ముక్త నవ్యశ్రీ జిల్లాకు పేరు తేవాలని కలెక్టర్ కె.మాధవీలత ఆకాంక్షించారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా కొవ్వూరు మండలం మద్దూరు జెడ్పీ హైస్కూలు నుంచి జాతీయ స్థాయికి ఎంపికయిన నవ్యశ్రీని, గైడ్ టీచర్ సీతారామాంజనేయులును కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లో అభినందించారు. ఈ నెల 27 నుంచి 31 వరకూ అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ పోటీల్లో నవ్యశ్రీ పాల్గొనడం హర్షణీయమన్నారు. ఆమె రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ ఏసీ ప్రాజెక్ట్ ఎంతో బాగుందని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. కార్యక్రమంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కస్తూరి సతీష్‌బాబు కూడా పాల్గొన్నారు.

కార్టూనిస్ట్ శేఖర్‌కు తానా అవార్డు



అవార్డు అందుకుంటున్న కార్టూనిస్ట్ శేఖర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నగరానికి చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్‌కు ప్రతిష్టాత్మక తానా అవార్డు లభించింది. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) తెలుగు భాష, సంస్కృతి అంశంపై అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ కార్టూన్ పోటీలు నిర్వహించింది. ఇందులో ఉత్తమ బహుమతి పొందిన శేఖర్‌కు విజయవాడ సర్వోత్తమ గ్రంథాలయంలో నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు.

దక్కుతున్న హక్కు

- సత్ఫలితాలిస్తున్న జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం
- ఇప్పటికే 17,883 శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ
- 90.07 శాతం మేర లక్ష్యసాధన

సాక్షి, రాజమహేంద్రవరం: భూ వివాదాలకు తెర దించి, శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చేపట్టిన 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష' పథకం సత్ఫలితాలనిస్తోంది. భూముల లావాదేవీల్లో చోటు చేసుకున్న అనేక వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. రీ సర్వే పూర్తయిన భూములకు పక్కా హద్దులతో.. వివాదాలకు తావు లేకుండా శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేస్తుండటం ప్రజలకు ఊరటనిస్తోంది.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేపడుతున్నారు. కంటిన్యూస్ ఆపరేటింగ్ రిఫరింగ్ స్టేషన్ నెట్‌వర్క్ సాయంతో ఈ ప్రక్రియ సాగుతోంది. గ్రామాల్లో రైతుల భూములను గుర్తించి ఆధార్ కార్డుల ప్రకారం వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. 101 ప్రాంతాల్లో డ్రోన్‌లను రంగంలోకి దింపారు. సర్వే ఆఫ్ ఇండియా, ప్రైవేటు ఏజెన్సీలు డ్రోన్ సర్వే చేసి ఇచ్చిన చిత్రాలు (ఓఆర్ఐ), భూ యజమానులు వాస్తవంగా చూపించిన సరిహద్దులను పోల్చి కొలతలు వేస్తున్నారు. అంగుళం కూడా తేడా లేకుండా సూక్ష్మ పరిశీలన చేస్తున్నారు.

సరిహద్దు వివాదాలకు తెర

సర్వే పూర్తయిన అనంతరం సరిహద్దు వివాదాలకు తెర దించుతున్నారు. వారి వారి పొలాల హద్దును సూచిస్తూ సరిహద్దు రాళ్లు పాతుతున్నారు. ఈ సర్వే రాళ్లను ఎ, బి, సి క్లాస్‌గా వర్గీకరించారు. ఏ పొలం వద్ద ఎటువంటి స్టోన్ అవసరమో అక్కడ అదే అమర్చుతున్నారు. జిల్లాలో 32,901 రాళ్లకు గాను ఇప్పటి వరకూ 18,591 పాతి 56.51 శాతం మేర లక్ష్యం సాధించారు. మిగిలిన 14,310 రాళ్లను నాటేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. వీటిని లబ్ధిదారులకు పూర్తి ఉచితంగా అందిస్తున్నారు.



భూ హక్కు పత్రం పంపిణీ చేస్తున్న జేసీ తేజ్‌భరత్, రాజమహేంద్రవరం ఆర్‌డీఓ చైత్రవర్షిణి

ఇదీ ఉపయోగం

భూ శాశ్వత హక్కు పత్రంతో అనేక ఉపయోగాలున్నాయి. బ్యాంకు రుణాలు, క్రయ విక్రయాల సమయంలో భూ యాజమాన్యపు హక్కు పత్రం – పట్టాదారు పాసు పుస్తకం అధికారికంగా చూపించాల్సిన అవసరం లేదు. పుస్తకం లేకపోయినా, చిరిగిపోయినా గ్రామ/వార్డు సచివాలయాల్లో నిర్ణీత రుసుం చెల్లించి నకలు పొందవచ్చు.

పత్రంలో ఏముందంటే?

భూ హక్కు – పట్టాదారు పాసు పుస్తకాన్ని అత్యంత పకడ్బందీగా భద్రతా ప్రమాణాలతో రూపొందించారు. మొదటి పేజీలో జిల్లా, డివిజన్, మండలం, గ్రామం, ఖాతా నంబరు, పాసు పుస్తకం జారీ తేదీ, పట్టాదారు వివరాలు, చిరునామా, ఆధార్, మొబైల్ నంబర్లు ఉంటాయి. పట్టాదారు ఫొటో, క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పట్టాదారు, పాస్ పుస్తకం వివరాలన్నీ తెలుస్తాయి. రెండో పేజీలో పట్టాదారు భూమి వివరాలు, సర్వే నంబరు వారీగా ఉంటాయి. భూ వర్గీకరణ, పట్టాదారుకు భూమి సంక్రమించిన వివరాలుంటాయి. సర్వే నంబరు వారీగా ఇచ్చిన ఎల్‌పీ నంబర్ ఉంటుంది. భూమి కమతం పటం, విశిష్ట సంఖ్యతో ఉన్న కమతానికి సంబంధించిన అక్షాంశాలు ఉంటాయి. వాటితో భూమి కొలతలు సులభంగా తెలుసుకోవచ్చు. భూమి సరిహద్దు రాళ్లు ఎవరైనా మార్చినా క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌లోని యాప్‌తో స్కాన్ చేస్తే తెలిసిపోతుంది.

రాష్ట్రంలో రెండో స్థానం

భూ హక్కు పత్రాల పంపిణీలో రాష్ట్రంలో రెండో స్థానంలో ఉన్నాం. మిగిలినవి వారం రోజుల్లో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. 90 శాతం పైగా పత్రాలు అందజేశాం. చిన్నపాటి తప్పులు దొర్లిన కొన్ని పత్రాలను సరిదిద్దేందుకు పంపాం. వారం రోజుల్లో 100 శాతం లక్ష్యం సాధిస్తాం. భూ పత్రాలు అధునాతన విధానంలో రూపొందించారు. భూమి సమగ్ర కొలతలతో పాటు క్యూఆర్ కోడ్ ఇచ్చారు. రైతు ఓటీపీ చెబితే తప్ప భూ కొలతల్లో మార్పులు చేసే అవకాశం ఉండదు. భూములపై సైబర్ సెక్యూరిటీ కోడ్ ఉంటుంది. రికార్డుల్లో ఎటువంటి మార్పులు చేయాలని ప్రయత్నించినా రైతు సెల్ ఫోన్‌కు ముందుగానే మెసేజ్ వస్తుంది.

- ఎన్.తేజ్‌భరత్, జాయింట్ కలెక్టర్

రూపాయి ఖర్చు లేకుండా..



బల్లిపాడులో నా పేరుతో ఉన్న 1.13 ఎకరాలకు రీ సర్వే చేసి హక్కు పత్రాలు అందజేశారు. రూపాయి కూడా ఖర్చు లేకుండా సర్వే చేసి, హద్దు రాళ్లు పాతి మరీ శాశ్వత పత్రం ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని సమర్థ విధానాన్ని అమలులోకి తెచ్చారు. గతంలో రైతులకు సర్వే నంబర్ బదులు ఇప్పుడు ఎల్‌పీ (ల్యాండ్ పార్సిల్) అని వస్తుంది.

- యెల్లిన శివరామకృష్ణ, బల్లిపాడు, తాళ్లపూడి మండలం

మండలాల వారీగా భూ హక్కు పత్రాల పంపిణీ ఇలా..

మండలం పేరు	అందిన భూ హక్కు పత్రాలు	పంపిణీ చేసినవి
గోకవరం	3	3
కడియం	318	309
రాజానగరం	3,460	3,111
అనపర్తి	5,641	4,998
రంగంపేట	662	649
బిక్కవోలు	6,859	6,132
రాజమహేంద్రవరం	285	241
నిడదవోలు	84	83
ఉండ్రాజవరం	70	70
పెరవలి	282	282
తాళ్లపూడి	111	111
కొవ్వూరు	426	420
గోపాలపురం	524	413
చాగల్లు	512	447
దేవరపల్లి	617	614

272 గ్రామాల్లో..

- జిల్లా వ్యాప్తంగా 272 గ్రామాల పరిధిలోని 16,00,527.06 ఎకరాల్లో దశల వారీగా రీ సర్వే చేపట్టాలని నిర్ణయించారు.
- తొలి దశలో 43 గ్రామాల పరిధిలోని 64,276 ఎకరాల్లో సర్వే పూర్తయింది.
- రెండో దశలో 16 గ్రామాలను ఎంపిక చేయగా, ఇప్పటికే 10 గ్రామాల్లోని 22,053 ఎకరాల్లో ప్రక్రియ పూర్తయింది.
- మిగిలిన ఆరు గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది.
- తొలి దశ సర్వే పూర్తయిన గ్రామాల్లో లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలను ప్రభుత్వం నుంచి వచ్చిన వెంటనే అందజేస్తున్నారు.
- ఇప్పటికే 39 గ్రామాలకు చెందిన 19,854 మందికి గాను 17,883 మందికి భూ హక్కు కల్పించి 90.07 శాతం మేర లక్ష్యం సాధించారు.
- మిగిలిన 1,971 మందికి త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తున్నారు.

వేద పండితుడు తంగిరాల విశ్వనాథశాస్త్రి కన్నుమూత



తంగిరాల విశ్వనాథశాస్త్రి (పాతచిత్రం)

రాజమహేంద్రవరం రూరల్: తంగిరాల వారి వంశంలో రెండో తరం ద్వివేదిగా, శ్రీశైలం దేవస్థానం ఆస్థాన విద్వాంసుడిగా 40 ఏళ్లు సేవలందించిన వేద పండితుడు తంగిరాల విశ్వనాథశాస్త్రి (100) కొంతమూరులోని ఆయన కుమారుని నివాసంలో కన్ను మూశారు. ఆయన అంత్యక్రియలు సోమవారం శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రముఖ త్రివేది తంగిరాల బాలగంగాధరశాస్త్రి పెద్ద కుమారుడైన విశ్వనాథశాస్త్రి సోమయాగం, మహాగ్నిచైనం, వ్యూఢ పొండరీకం, వాజపేయం, బృహస్పతీసవం తదితర ఉత్కృష్ట యాగాలు నిర్వహించారు. పొండరీక, వాజపేయ, సోమయాజులుగా పేరు పొందారు. ఆయనకు ముగ్గురు కుమారులు. వారందరూ కూడా ద్వివేదులే. ఆయన ఐదుగురు మనవలు కూడా వేద విద్య అభ్యసిస్తున్నారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సమక్షంలో ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆహితాగ్ని భాస్కర బిరుదును, స్వర్ణ కంకణాన్ని విశ్వనాథశాస్త్రి అందుకున్నారు. వేలాది మంది శిష్యుల్ని తయారు చేసిన ఘనత ఆయనకు ఉంది. శ్రీశైలం దేవస్థాన ఆస్థాన విద్వాంసుడిగా పదవీ విరమణ అనంతరం కపిలేశ్వరపురం వేద పాఠశాలలో ఉపాధ్యాయునిగా సేవలు అందిస్తున్నారు. కొద్ది రోజులుగా అస్వస్థతకు గురైన ఆయన చికిత్స పొందుతూ కన్ను మూశారు. విశ్వనాథశాస్త్రి పార్థివ దేహాన్ని జిల్లా బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసు, చిలకమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరుమాళ్ళ రఘునాథ్, వందలాదిగా వేద పండితులు సందర్శించారు.

ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ మాధవీలత ఆదేశం
- స్పందనలో 220 అర్జీల స్వీకరణ



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీనీ నిర్ణీత సమయంలో నాణ్యతతో, వ్యక్తిగత బాధ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ 220 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, అర్హులందరికీ సకాలంలో న్యాయం చేయాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారాన్ని రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తారని, జేకేసీలో వచ్చిన అర్జీలను 1902 కాల్ సెంటర్‌కు పంపుతారని వివరించారు. జగనన్నకు చెబుదాం (జేకేసీ) వెబ్ పోర్టల్‌లో కూడా స్పందన దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. స్పందన పోర్టల్ ఇకపై జేకేసీగా మారుతున్నందున జిల్లా అధికారులందరూ ఒకటికి రెండు సార్లు దీనిని పరిశీలించుకోవాలని సూచించారు. శాఖాపరమైన కోర్టు కేసులపై తక్షణం ఫైలింగ్ చేపట్టాలని, ఆలస్యం జరిగితే కలెక్టర్, రాష్ట్ర కార్యదర్శుల నుంచి తాఖీదులు వస్తాయని తెలిపారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

కొత్త జిల్లా ఏర్పడిన తరువాత జరుగుతున్న గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించాలని, దేశ భక్తిని ప్రతిబింబించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. వివిధ శాఖల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ప్రాథమికంగా తొమ్మిది శాఖల శకటాలను ప్రదర్శించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. జనవరి 26న జిల్లా స్థాయి జాతీయ పతాక ఆవిష్కరణకు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రదర్శన ఇచ్చే వారి వివరాలు ముందస్తుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చేదోడు పథకానికి అవసరమైన లేబర్ సర్టిఫికెట్‌ను దరఖాస్తుదారుకు అందిస్తున్న సచివాలయ ఉద్యోగి



సచివాలయంలో ఇంటి రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

సేవా నిలయాలు

- పాలనను ప్రజలకు చేరువ చేసిన సచివాలయాలు
- కొత్త జిల్లాలో ఇప్పటి వరకూ 8,36,034 పౌర సేవల అందజేత
- రోజుకు 91.19 శాతం మేర సేవలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజల ముంగిటే పాలన.. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు.. అధికారుల చుట్టూ తిరగనవసరం లేదు.. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేస్తామని నాటి ప్రజాసంకల్ప పాదయాత్రలో అప్పటి విపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించినప్పుడు చాలామంది నమ్మలేకపోయారు. కొంతమంది వెటకారం కూడా చేశారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత రాష్ట్రంలో ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ రూపురేఖలే మారిపోయాయి. జాతిపిత గాంధీజీ కన్న **గ్రామ స్వరాజ్యం కలను సాకారం చేసేలా.. సీఎం జగన్ ప్రారంభించిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ అనితరసాధ్యమైన విజయాలు సాధిస్తోంది. గతంలో కుల/ఆదాయ వంటి ధ్రువీకరణ పత్రాలు కావాలంటే పనులు మానుకుని తహసీ**ల్దార్ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రజలు తమ అవసరం చెబితే గ్రామ/వార్డు వలంటీరే నేరుగా ఇంటికి వచ్చి, దగ్గరుండి దరఖాస్తు చేయించి, మిగిలిన ప్రక్రియంతా పూర్తి చేయించి, ఆయా ధ్రువపత్రాలను నేరుగా దరఖాస్తుదారు చేతిలో పెడుతున్నారు. ఇలా ఒక్కటనేమిటి? సచివాలయ వ్యవస్థ ద్వారా మొత్తం 543 ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయి.

రోజుకు 90 శాతం పైనే..

- నూతన తూర్పు గోదావరి జిల్లా ఏర్పడిన తరువాత గత ఏడాది ఏప్రిల్ 6 నుంచి ఈ నెల 22వ తేదీ వరకూ వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో పౌరసేవలకు సంబంధించి సచివాలయాల ద్వారా 8,67,140 వినతులు స్వీకరించారు. వీటిలో 8,36,034 పరిష్కరించారు. తద్వారా సగటున 96 శాతం మేర పౌరసేవలు అందించారు.
- జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా గత వారం 45,485, ఈ వారం 46,690 చొప్పున పౌరసేవలు అందించారు.
- దీని ప్రకారం ప్రతి రోజూ సగటున 91.19 శాతం మేర పౌరసేవలు అందిస్తున్నారు.
- పౌరసేవల్లో రాష్ట్ర సగటు 61.34 శాతం కాగా జిల్లాలో 91 శాతం పైనే ఉండటం గమనార్హం.

ఉద్యోగులు అభినందనీయులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దూరదృష్టితో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ పరిపాలన వికేంద్రీకరణకు ఎంతో దోహదపడుతోంది. గతంలో వివిధ సర్టిఫికెట్ల కోసం చాలామంది రోజుల తరబడి వేచి ఉండేవారు. కానీ నేడు **చాలా తక్కువ సమయంలోనే శ్రమ లేకుండా పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పౌరసేవలకు సంబంధించి రోజుకు కనీసం 5 వేలు పైనే వినతులు స్వీకరిస్తున్నాం. ఎంతో నిబద్ధతతో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులు అభినందనీయులు.**

- డాక్టర్ కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

కాళ్లరిగేలా తిరిగేవాళ్లం



కుల ధ్రువీకరణ పత్రం కోసం గతంలో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవాళ్లం. రోజుల తరబడి తిరిగితేనే కానీ సర్టిఫికెట్ వచ్చేది కాదు. సచివాలయాలు వచ్చిన తరువాత వలంటీరే ఇంటికి తీసుకు వచ్చి ఇస్తున్నారు.

- చెక్కా సుబ్బలక్ష్మి, 79వ సచివాలయం, రాజమహేంద్రవరం

సదరం సర్టిఫికెట్ వెంటనే వచ్చింది



వైకల్యం ఉండటంతో పింఛనుకు దరఖాస్తు చేసుకున్నాను. దీనికి సదరం సర్టిఫికెట్ కావాలని అడిగారు. చాలా రోజులు తిరిగినా రాలేదు. వెంటనే సచివాలయంలో సంప్రదించాను. వెంటనే దరఖాస్తు చేయించి, సర్టిఫికెట్ వచ్చేలా చేశారు. ఈ నెల నుంచి దివ్యాంగ పింఛను అందుకుంటున్నాను.

- మానుకొండ మిల్టన్, 84వ సచివాలయం, రాజమహేంద్రవరం

నూతన తూర్పు గోదావరి జిల్లా ఏర్పడిన తరువాత అందించిన పౌరసేవల వివరాలు (2022 ఏప్రిల్ 6 నుంచి ఈ నెల 22వ తేదీ వరకూ)

విభాగం	మొత్తం వినతులు	పరిష్కరించినవి
ఆధార్	48,649	48,649
పశు సంవర్ధక, మత్స్య, డెయిరీ	180	180
బిల్ పేమెంట్	2,27,574	2,27,574
పౌర సరఫరాలు	34,192	32,488
ఎలక్ట్రానిక్ డెలివరీ సర్వీస్	23	23
ఎండోమెంట్	6	6
ఎనర్జీ, ఈపీడీసీఎల్	4,456	4,443
వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం	13,106	13,099
హోం	379	351
పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, వాణిజ్యం	18	18
ఉపాధి కల్పన, శిక్షణ, ఫ్యాక్టరీస్	212	212
కార్మిక శాఖ	295	295
పుర పరిపాలన, పట్టణాభివృద్ధి	9,726	9,414
పంచాయతీరాజ్, రూరల్ డిపార్ట్‌మెంట్	17,146	16,503
పోలీసు	256	181
స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్	4,363	4301
రెవెన్యూ	5,04,513	4,94,229
రూరల్ డెవలప్‌మెంట్	1,487	1,487
సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్	558	400
రవాణా శాఖ	1	1
ఆర్అండ్‌బీ	2	2

జిల్లాలో సచివాలయాలు : 512

ఉద్యోగులు : 4,408

గ్రామ/వార్డు వలంటీర్లు : 8,881

క్లుప్తంగా

కలుపు మందు తాగి వ్యక్తి మృతి

ముమ్మిడివరం: మద్యం మత్తులో ఒక వ్యక్తి కలుపు మందు తాగి మృతి చెందాడు. ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతానికి చెందిన చప్పిడి వీరబాబు(42) తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో మకాం ఉంటున్నాడు. ఆదివారం ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చి తన ఆర్థిక పరిస్థితి బాగో లేదని, ఆదుకోవాలని వారితో చెప్పుకున్నాడు. అనంతరం అతిగా మద్యం తాగాడు. ఆ మైకంలో అతను కలుపుమందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. అతనిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ముగ్గురు బ్లేడ్ బ్యాచ్ సభ్యుల అరెస్ట్

ధవళేశ్వరం: స్థానిక కంచర్లలైన్‌లో ఈ నెల 16వ తేదీన అండిబోయిన రాజేష్ అనే యువకుడిని చాకుతో పొడిచి హత్య చేసిన ముగ్గురు బ్లేడ్ బ్యాచ్ సభ్యులను సోమవారం అరెస్ట్ చేశామని ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి తెలిపారు. ప్రధాన నిందితుడితో పాటు మరో నిందితుడు మైనర్ అని పేర్కొన్నారు. వీరితోపాటు మోరంపూడి రాజ్‌కుమార్ అనే యువకుడిని అరెస్ట్ చేశామన్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచామని సీఐ మంగాదేవి వెల్లడించారు.

యూడైస్‌తో ఎంతో ప్లస్



- పాఠశాల స్థాయి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్న విద్యాశాఖ
- దీని ఆధారంగానే 2023–24 సమగ్ర శిక్షా బడ్జెట్ రూపకల్పన
- అందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల మంజూరు
- ఈ నెల 26 ఆన్‌లైన్ నమోదుకు తుది గడువు

రాయవరం: పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. పాఠశాలల్లో మౌలిక, భౌతిక అవసరాలకు ఏటా రూపొందిస్తున్న ప్రణాళికల ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల కేటాయింపు జరుగుతుంటుంది. ప్రణాళిక రూపకల్పనలో భాగంగా యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నారు. వచ్చిన సమాచారం ఆధారంగానే జిల్లా సమగ్ర శిక్షా బడ్జెట్ రూపకల్పనకు వీలవుతుంది.

సెప్టెంబర్ 30వ తేదీ ప్రాతిపదిక

సమగ్ర జిల్లా విద్యా సమాచార వ్యవస్థను యూడైస్‌గా పేర్కొంటారు. 2022–23 విద్యా సంవత్సరం పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సదుపాయాల వివరాలను యూడైస్ ద్వారా సేకరిస్తారు. కేంద్ర ప్రభుత్వం యూడైస్ ద్వారా పాఠశాలల సమాచార సేకరణను 2000 సంవత్సరం నుంచి ప్రారంభించింది. ఏటా సెప్టెంబర్ 30 తేదీని ప్రాతిపదికగా తీసుకుని యూడైస్ ద్వారా పాఠశాలల సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ ఏడాది కూడా పాఠశాలల సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు విద్యాశాఖ, ఏపీ సమగ్ర శిక్షా సంయుక్తంగా కసరత్తు ప్రారంభించాయి. ఈ వివరాల ద్వారానే సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌ను సాధించడం సాధ్యపడుతుంది. ఎస్‌డీజీ, పీజీఏ, నీతి ఆయోగ్‌కు సంబంధించిన అన్ని విషయాలకు యూడైస్ ప్రాతిపదికగా నిలుస్తోంది. ఈ డేటా ఆధారంగా విద్యాశాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాల నిర్వహణ, 2023–24 విద్యా సంవత్సరానికి సమగ్ర శిక్షా బడ్జెట్ రూపకల్పన వీలవుతుంది.

ఈ నెల 26 తుది గడువు

గతంలో యూ డైస్ ప్లస్ సమాచార సేకరణ మాన్యువల్‌గా ఉండేది. మూడేళ్లుగా ఆన్‌లైన్‌లోనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. పాఠశాల కేంద్రంగా సమాచారాన్ని హెచ్‌ఎంలు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఈ సమాచారం నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరుతుంది. ఈ నెల 26వ తేదీలోగా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు యూడైస్ రూపకల్పనలో బిజీగా ఉన్నారు. ఈ నెలాఖరులో జిల్లా బడ్జెట్ రూపకల్పనకు తుది రూపు వచ్చే అవకాశం ఉంది.



తుది రూపునకు విద్యా ప్రణాళిక..

సాధారణంగా ఏటా రూపొందిస్తున్న ప్రణాళికల ఆధారంగానే పాఠశాలల్లో మౌలిక అవసరాలకు నిధుల కేటాయిస్తారు. పాఠశాలల నుంచి వచ్చే సమాచారమే నిధుల కేటాయింపునకు ప్రాతిపదికగా నిలుస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 5,261 విద్యా సంస్థల నుంచి సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కావాలన్నా, ఉన్న పోస్టులను రేషనలైజేషన్ చేయాలన్నా, నూతనంగా అదనపు తరగతి గదులు, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ర్యాంపులు, వంటగదులు, లేబొరేటరీ గదులు, ప్రత్యేక అవసరాల గల చిన్నారులకు ఉపకరణాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు.. ఇలా ఏది మంజూరు చేయాలన్నా కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్ ద్వారా పంపే సమాచారాన్నే ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఈ సమాచారం ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీ సమగ్ర శిక్షాకు నిధులు కేటాయిస్తాయి. అందుకే యూడైస్ ప్లస్ ద్వారా సేకరించే సమాచారం కీలకంగా మారుతుంది.

సమాచారం కీలకం



విద్యాశాఖకు సంబంధించిన బడ్జెట్ రూపకల్పనకు యూడైస్ ప్లస్ సమాచారం ఎంతో కీలకం. పాఠశాల హెచ్‌ఎంలు క్షేత్ర స్థాయిలో ఉన్న కచ్చితమైన సమాచారాన్ని యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ సమాచారం పాఠశాలల అభివృద్ధికి కీలకంగా ఉంటుంది.

– డి.మధుసూదనరావు, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

గడువులోగా పూర్తి చేయాలి



యూడైస్ సమాచార సేకరణను హెచ్‌ఎంల సహకారంతో అనుకున్న సమయానికి పూర్తి చేస్తాం. ఉపాధ్యాయులు ఇచ్చే సమాచారం ఆధారంగానే పాఠశాలలకు నిధుల కేటాయింపు ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంది.

– ఎస్.అబ్రహం, డీఈవో, తూర్పుగోదావరి

ఆ వివరాలు తప్పనిసరి



యూ డైస్ ప్లస్ నమోదు సమయంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలి. పాఠశాల సమగ్ర సమాచారం యూడైస్ ప్లస్‌లో స్పష్టంగా కనిపించాలి. ప్రధానోపాధ్యాయులు పకడ్బందీగా సమాచార సేకరణ చేపట్టాలి.

– ఎస్‌వీ రవిసాగర్, డీఈవో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- బీటెక్ విద్యార్థి మృతి
- మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన తరుణ్‌బాబు



తరుణ్‌బాబు (ఫైల్)

మాకవరపాలెం : బైక్‌తో ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతిచెందగా ఇద్దరు గాయపడ్డారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలం పొదలాడకు చెందిన లంకె తరుణ్‌బాబు, సింగిరెడ్డి దినేష్(విజయనగరం), రావాడ లోకేష్ (శ్రీకాకుళం)లు మండలంలోని తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులు. వీరంతా కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. అయితే ఆదివారం రాత్రి మోటారు సైకిల్‌పై నర్సీపట్నం వెళ్లిన వీరు తిరిగి వస్తుండగా రాచపల్లి జంక్షన్ సమీపంలో కామేశ్వరమ్మ ఆలయం వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. దీంతో తరుణ్‌బాబు అక్కడికక్కడే మృతి చెందగా, దినేష్ తీవ్రంగా, లోకేష్ స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న దినేష్‌ను విశాఖ తరలించారు. ఈ సంఘటనలో బైక్ నుజ్జునుజ్జయింది. కొద్ది నిమిషాల వ్యవధిలోనే హాస్టల్‌కు చేరుకోనున్న తరుణ్‌బాబు మృతి చెందడంతో తోటి విద్యార్థులు, కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సర్వీసు అందించాలి



షోరూమ్ ప్రారంభోత్సవంలో జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, షోరూమ్ చైర్మన్ రమేష్ తదితరులు



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

పృథ్వీ టయోటా షోరూమ్ ప్రారంభోత్సవంలో ఎంపీ గీత, ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి

కాకినాడ రూరల్: ఖాతాదారులకు మెరుగైన సర్వీసును అందివ్వాలని ఎంపీ వంగా గీత, కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోరారు. కాకినాడ – పిఠాపురం రోడ్డులో రాయుడుపాలెం జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పృథ్వీ టయోటా షోరూమ్‌ను సోమవారం వారు ప్రారంభించారు. షోరూమ్ చైర్మన్ మాలెంపాటి రమేష్‌బాబు, డైరెక్టర్ పృథ్వీలకు అభినందనలు తెలియజేశారు. చైర్మన్, డైరెక్టర్లు మాట్లాడుతూ కాకినాడ ప్రాంతంలో టయోటా వాహనాలకు సర్వీసు సదుపాయం కొన్నేళ్లుగా నిలిచిపోయిందని, ఇప్పుడు కొత్తగా పృథ్వీ టయోటా షోరూమ్ ద్వారా ఆ లోటు తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. షోరూమ్ ద్వారా కస్టమర్లకు మెరుగైన సేవలందిస్తామన్నారు. ప్రారంభం సందర్భంగా 100శాతం ఫైనాన్స్ సౌకర్యంతో వాహనాలను కస్టమర్లకు అందిస్తున్నామన్నారు. ఇటీవల రాజమహేంద్రరంలో షోరూమ్ ప్రారంభించి ఉభయ గోదావరి జిల్లాల కస్టమర్ల మన్ననలు పొందామన్నారు.

రాయుడుపాలెం వద్ద షోరూమ్ ప్రారంభోత్సవంలో కలెక్టరు కృతికా శుక్లా, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, పిఠాపురం, పెద్దాపురం ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, సేల్స్ మేనేజర్ శివ, సర్వీసు మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా మొదటి కారును బి.శ్రీనివాస్, రెండవ కారును టి.వెంకటరత్నం కొనుగోలు చేశారు.

సైకత ప్రశ్న



దేవిన సిస్టర్స్ రూపొందించిన సైకత శిల్పం

రంగంపేట: తూర్పు గోదావరి జిల్లా రంగంపేటలో దేవిన సిస్టర్స్ రూపొందించిన సైకత శిల్పం పలువురిని ఆలోచింపజేస్తోంది. ఈ నెల 24న జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్) ఆడపిల్లగా పుట్టడమే పాపమా..? అనే నినాదంతో సోమవారం సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ శిల్పాన్ని తీర్చిదిద్దిన దేవిన సిస్టర్స్‌ను పలువురు అభినందిస్తున్నారు.

హోంగార్డు దుర్మరణం



హోంగార్డు గోవిందు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని మాలపాడుకు చెందిన హోంగార్డు మేడిశెట్టి గోవిందు(33) సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు రామచంద్రపురం ఎస్సై డి.సురేష్‌బాబు విలేకరులకు తెలిపారు. హోంగార్డు గోవిందు మూడు రోజుల క్రితం జిల్లా కేంద్రం అమలాపురానికి రిపబ్లిక్ పరేడ్ నిమిత్తం వెళ్లాడు. ఆదివారం జరిగిన పోలీస్ సెలెక్షన్ పరీక్షలకు పరేడ్ ఇన్‌చార్జి అనుమతి తీసుకుని వచ్చాడు. సోమవారం తెల్లవారు జామున తిరిగి పరేడ్‌కు వెళ్తున్నట్లు ఇంటిలో తెలియజేసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. అయితే మాలపాడు–కొత్తూరు మధ్య గల కోళ్ళ ఫారం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పెద్ద శబ్దం అయ్యేసరికి సమీపంలోని పొలంలో పనిచేస్తున్న ఇంత చంటి వచ్చి చూసేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలియజేయగా, వారు వచ్చి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్ష చేసి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీనితో ఆసుపత్రి సమాచారం, సోదరుడు మేడిశెట్టి సత్యానందం ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

గ్రామంలో విషాద ఛాయలు..

అందరితో కలివిడిగా ఉండే హోంగార్డు గోవిందు మృతితో గ్రామంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. గోవిందుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉద్యోగంలో ఉన్నతి కోసం పరీక్ష రాయడానికి వచ్చి తిరిగిరాని లోకాలకు తరలిపోయిన గోవిందు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

వల్లీ సిల్క్స్‌లో పట్టు చీరల విభాగం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: కోటగుమ్మం సెంటర్‌లోని వల్లీ సిల్క్స్ షోరూంలో పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా సోమవారం పట్టు చీరల విభాగం ప్రారంభమైంది. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సీజన్‌లో అనేక ఆఫర్లతో కొత్త కలెక్షన్లు అందిస్తున్న వల్లి సిల్క్స్ షోరూంలో త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామిజీ చేతుల మీదుగా నూతన పట్టు విభాగం ప్రారంభించామని వల్లి సిల్క్స్ డైరెక్టర్ సుభాష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టు చీరల విభాగంలో పెళ్లిళ్లకు, పండగలకు, అన్ని శుభకార్యాలకు కావాల్సిన పట్టు వెరైటీలు లభిస్తాయన్నారు. లక్షకు పైగా చీరలు, 6,000 పైగా వెరైటీలు, రూ.250 నుంచి రూ. 2 లక్షలకు వరకు వస్త్ర శ్రేణి లభిస్తుందన్నారు. మహిళలు కోరుకునే కంచి పట్టు చీరలు, బనారస్, ఇక్కత్, కలంకారీ, ఆర్గాంజా, లైట్ వెయిట్ పట్టు, గద్వాల్, జార్జెట్, బనారస్, భాంధిని, డిజైనర్ వర్క్ శారీస్, పట్టు ఇక్కత్ పావడాస్ లాంటి ఎన్నో వెరైటీలు లభిస్తాయన్నారు. పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని డైరెక్టర్ సుభాష్ తెలిపారు.

పట్టాలు తప్పిన గూడ్స్



సామర్లకోట – పిఠాపురం బైపాస్ లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్

సామర్లకోట: కాకినాడ నుంచి విశాఖపట్నానికి ఎరువుల లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు సోమవారం పట్టాలు తప్పింది. సామర్లకోట సమీపంలోని ఉండూరు రైల్వే గేటు మీదుగా బైపాస్ లైన్ నుంచి విశాఖ వెళ్లే ప్రధాన లైనులోకి మారుతున్న సమయంలో ఇంజిన్ నుంచి 21వ వ్యాగన్ పట్టాలు తప్పింది. సామర్లకోట – పిఠాపురం రైల్వే లైను కేఎం నంబరు 630/18–22 మధ్య ఈ ప్రమాదం జరిగినట్టు రైల్వే అధికారులు తెలిపారు. సుమారు 100 మీటర్లు వెళ్లిన తరువాత వాక్యూమ్ బయటకు రావడంతో గూడ్స్ డ్రైవర్ అప్రమత్తమై, రైలును నిలిపివేశారు. ఈ ప్రమాదంతో 100 మీటర్ల మేరకు స్లీపర్లు పాడైపోయాయి. ఏలేరు కాలువ తూము వద్ద రైలు ఒత్తిడికి పట్టా విరిగిపోయింది. విశాఖపట్నం – విజయవాడ మధ్య పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. విజయవాడ వెళ్లే యశ్వంత్‌పూర్, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లను పిఠాపురంలో నిలిపివేశారు. రైల్వే ఉన్నతాధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీకాంత్ ఆధ్వర్యాన ఏడీఎంఎ ఇ.శామ్యూల్ కుమార్, ఏడీఈఎన్ శివప్రసాద్, ఏడీఈఈ సీహెచ్ శ్రీహరివర్మ, రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, పబ్లిక్ వే ఇన్‌స్పెక్టర్లు రామసుబ్బారావు, సాయి శంకర్, సామర్లకోట, పిఠాపురం, తుని, కాకినాడ ప్రాంతాలకు చెందిన గ్యాంగ్‌మన్లు అక్కడకు చేరుకున్నారు. రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేక క్రేన్‌ను తీసుకు వచ్చి పట్టాలు తప్పిన వ్యాగన్‌ను సరి చేశారు. సామర్లకోట – పిఠాపురం బైపాస్ లైను దెబ్బ తినడంతో ఆ ట్రాక్ మీదుగా రైళ్ల రాకపోకలను నిలిపి వేశారు. కాకినాడ – విశాఖపట్నం మధ్య నడిచే గూడ్స్ రైళ్లను సామర్లకోట స్టేషన్ మీదుగా మళ్లించారు.

కట్నం వేధింపులపై భర్తతో సహా నలుగురిపై కేసు

పి.గన్నవరం: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తతో సహా నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పి.గంగాభవాని తెలిపారు. ముంగండ గ్రామానికి చెందిన దొమ్మేటి నాగార్జునకు 2012లో శ్రీదేవితో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.3 లక్షలు, బంగారు నగలు కట్నంగా ఇచ్చారని, 2017లో వారికి కుమారుడు జన్మించాడని ఆమె వివరించారు.

అప్పటి నుంచి మరో రూ.2 లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని శ్రీదేవిని వేధిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్దల సమక్షంలో చర్చలు జరిగినా వేధింపులు ఆగలేదన్నారు. అదనపు కట్నం తేలేదని ఈ నెల 19న కుమారుడితో సహా శ్రీదేవిని ఇంటి నుంచి బయటకు గెంటివేశారని తెలిపారు. బాధితురాలు శ్రీదేవి ఫిర్యాదు మేరకు భర్త నాగార్జున, అత్తమామలు సత్యవతి, శ్రీనివాస్, బావ ఉపేంద్రలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ గంగాభవాని వివరించారు.

ఇంటర్మీడియెట్ విద్యార్థిని అదృశ్యం

కాకినాడ క్రైం: నగరంలో ఇంటర్మీడియెట్ చదువుతున్న ఒక విద్యార్థిని అదృశ్యంపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కాకినాడ బ్యాంక్‌పేటకు చెందిన హసీనాభాను అనే 17ఏళ్ల విద్యార్థిని స్థానిక సాంబమూర్తినగర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ కళాశాలలో చదువుతూ అక్కడి వసతి గృహంలోనే ఉంటోంది. సోమవారం ఉదయం 5.30 గంటలకు విద్యార్థిని వసతి గృహం నుంచి వెళ్లిపోయినట్టు ప్రిన్సిపాల్ మధుసూదనరావు కాకినాడ త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.